## రైతునేస్తం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

చొప్పదండి, ఏప్రిల్ 14: పట్టణంలోని రైతువేదికలో సోమవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుంటి మల్లయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

మానకొండూర్, ఏప్రిల్ 14: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను కేంద్రం అధికారి భూదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1944లో ముంబాయి షిప్‌యార్డులో జరిగిన అగ్నిప్రమాదంలో 71 మంది అగ్నిమాపక సిబ్బందితో పాటు సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని ఏటా ఈవారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇక్కడ సిబ్బంది ఉన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూర్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి భూదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## జార్జి రెడ్డికి ఘన నివాళి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 14 : పీడీఎస్‌యూ సంస్థాపకుడు కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ, జార్జిరెడ్డి ఆశయ సాధన కోసం విద్యార్థులంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కెంసారపు రవితేజ, నాయకులు కొయ్యడ బాబు, ఎండీ అస్లాం, రమేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో తవ్వకాలు

సైదాపూర్, ఏప్రిల్14: సర్వాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని శివరాంపల్లి దర్గాలో తవ్వకాలు జరుగగా, ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న గ్రామస్తులు దర్గాలోకి వెళ్లగా అక్కడ తవ్వకాల విషయం వెలుగులోకి వచ్చింది. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని గ్రామస్తులు ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దళితుల ఆశాజ్యోతి

మానకొండూర్, ఏప్రిల్ 14: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు, దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఇస్కుల్ల అంజయ్య, నాయకులు కేతిరి దేవేందర్‌రెడ్డి, నెల్లి మురళి, పిట్టల మధు, అంబేద్కర్, దళిత సంఘాలు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

## అందరికీ స్ఫూర్తి

చొప్పదండి, ఏప్రిల్ 14: ప్రపంచ మేధావి బీఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండి పట్టణంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజంలో కులాలు, మతాలకతీతంగా రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్ర శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.




చొప్పదండి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గంగాధర: మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సైదాపూర్: దుద్దనపల్లిలో జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



రామడుగు: వెలిచాలలో నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ వీర్ల సరోజన



అంబేద్కర్ జయంతి వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్

# ఊరూరా అంబేద్కర్ జయంతి

- దళిత, ప్రజా, కుల సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

కార్పొరేషన్/తెలంగాణచౌక్/కమాన్‌చౌరస్తా/ ముకరంపుర/ హుజూరాబాద్/ రూరల్/ జమ్మికుంట/ వీణవంక/ సైదాపూర్/ శంకరపట్నం/ చొప్పదండి/ రామడుగు/ గంగాధర/ మానకొండూర్/ రూరల్/ కరీంనగర్ రూరల్/ చిగురుమామిడి/ తిమ్మాపూర్/ గన్నేరువరం, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని సోమవారం జిల్లాలో ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పార్టీ ఆఫీసులు, కూడళ్ల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. నగరంలోని కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడుగుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, బండారి వేణు, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, చందు, రవి, చేతి చంద్రశేఖర్, ఆరె రవి తదితరులు పాల్గొన్నారు. నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వేడుకలకు విశిష్ట అతిథిగా మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ హాజరై, ఈడీ సోలమన్, ఆర్‌ఎం రాజుతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు భూపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, డీఎంలు శ్రీనివాస్, విజయమాధురి, సిబ్బంది పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్, కార్యవర్గ సభ్యులు వేడుకలు నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో నివాళుర్పించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ మధుబాబు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి సంఘం జిల్లా కార్యదర్శి తిప్పారపు నరేశ్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి వేర్వేరుగా కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్‌ఈ మేక రమేశ్ బాబు, ఉద్యోగులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి అధ్యక్షతన మహనీయుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా అంబేద్కర్ జయంతి నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, విశిష్ట అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, ప్రత్యేక అతిథిగా కొండగట్టు జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి, జిల్లా మాజీ సంయుక్త కలెక్టర్ గంగారాం హాజరయ్యారు. రామడుగులో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, వెలిచాలలో మాజీ సర్పంచ్ వీర్ల సరోజన నివాళులర్పించారు. సైదాపూర్ మండలం దుద్దనపల్లిలో ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ హాజరయ్యారు. అంబేద్కర్ సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటిపల్లి యుగేంధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. చొప్పదండితోపాటు గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బూరుగుపల్లి, మధురానగర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానకొండూర్ మండలం వన్నారంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసి, నిర్మాణ పనులను సీనియర్ నాయకుడు పొలాడి రామారావు ప్రారంభించారు. కరీంనగర్ మండలం చామనపల్లిలో మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం రేకొండలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోయిని అశోక్, అంబేద్కర్ జయంతి ఉత్సవ నిర్వాహకుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 మందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉల్లంపల్లి గ్రామంలో జయంతి వేడుకలకు అరుణోదయ నాట్య మండలి అధ్యక్షురాలు విమలక్క హాజరయ్యారు. మానకొండూర్‌తోపాటు తిమ్మాపూర్ మండలం అల్గునూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. మహాత్మానగర్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అంబేద్కర్ జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు.



కరీంనగర్ కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, నాయకులు

# అంబేద్కర్ అందరివాడు

- ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

కలెక్టరేట్, ఏప్రిల్ 14 : అంబేద్కర్ అందరివాడని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బాబాసాహెబ్ 134వ జయంతిని పురస్కరించుకుని, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కోర్టు చౌరస్తాలో నిర్వహించిన జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయనను నిరంతరం స్మరించుకునే క్రమంలో నగరంలో అంబేద్కర్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుసేన్, పలువురు నాయకులు మాట్లాడారు.

**దళిత నేతల అసంతృప్తి**

అంబేద్కర్ జయంత్యుత్సవ సభ నిర్వహణపై పలువురు దళిత నేతలతో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ఇంకొంత మంది దళిత నాయకులు అలకబూనారు. గిరిజన నాయకుడు బీమా సాహెబ్ మాట్లాడుతూ, 2021-22 ఆర్థిక సంవత్సరంలో ట్రైకార్ నిధుల ద్వారా రాష్ట్రంలోని 30వేల మంది గిరిజన యువతకు ఉపాధి కోసం రూ.250కోట్లకు పైగా నిధులు చెక్కుల రూపేణా సిద్ధంగా ఉన్నా, యంత్రాంగం లబ్ధిదారులకు చెక్కులు అందించడం లేదని, వీరంతా రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకుంటే వెబ్‌సైట్‌లో అంగీకరించడం లేదని, ప్రభుత్వ నిర్ణయంతో రెండు రకాలుగా గిరిజన యువత నష్టపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సమస్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ, దీనిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారికి సమాచారమిచ్చినా పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జెల కాంతం ఆరోపించారు. దళితులకు వ్యతిరేకంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నదంటూ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మండిపడగా, సభ నిర్వహణ కమిటీ చైర్మన్ డా.కవ్వంపల్లి సముదాయించారు.

## వేదికపైకి ఆహ్వానించలేదని

- దళిత నాయకురాలి బైఠాయింపు

కలెక్టరేట్, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమ వేదిక పైకి తనను ఆహ్వానించకపోవడంపై కరీంనగర్‌లో ఓ దళిత మహిళా నాయకురాలు వేదిక ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జయంతి ఉత్సవాలు నిర్వహించారు. గతంలో వేడుకలు ఉదయం నుంచి మొదలు సాయంత్రం వరకు నిర్వహించేవారు. రెండు వర్గాల నాయకులను సమన్వయపరుస్తూ, సభ విజయవంతానికి కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే ఎమ్మెల్యే కృషి చేసేవారు. అయితే, ఈసారి మాత్రం ఇందుకు భిన్నంగా జరుగడంతో సభ ఒక వర్గానికే పరిమితమైందని ఆరోపిస్తూ, తమను కూడా వేదికపైకి పిలువాలంటూ దళిత నాయకురాలు దండి శారద వేదిక ఎదుట బైఠాయించి నిరసనకు దిగింది. పోలీసులు రావడంతో దండం పెడుతూ తన వద్దకు రావద్దని కోరుతూ కంటతడి పెట్టింది. అదే సమయంలో మాల సామాజిక వర్గానికి చెందిన పలువురు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు ర్యాలీగా తరలిరావడంతో, వేదికపైకి దూసుకొచ్చే ఆస్కారముంటుందనే భావనతో పోలీసులు వేదిక చుట్టూ రోప్ పార్టీతో భద్రతా చర్యలు చేపట్టారు. మాల సంఘం నాయకులంతా వేదికవైపు చూడకుండా తిరిగి వెళ్లగా, వేదిక ముందు బైఠాయించిన దండి శారద కూడా అక్కడి నుంచి వెళ్లిపోయింది. జయంత్యుత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పోటీపడడంతోనే, ఈ పరిస్థితి తలెత్తిందంటూ దళిత నాయకులు చర్చించుకోవడం కనిపించింది.



కంటతడి పెడుతున్న దళిత నాయకురాలు దండి శారద

## ఆటో బోల్తా: మహిళా కూలీలకు గాయాలు

- డ్రైవర్ పరిస్థితి విషమం

శంకరపట్నం, ఏప్రిల్ 14: మండలంలోని ఆముదాలపల్లిలో మహిళా కూలీలతో వెళ్తున్న ఓ ప్యాసింజర్ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నది. స్థానికుల కథనం ప్రకారం.. రాజాపూర్ ఎస్సీ కాలనీకి చెందిన కనకం అంజయ్య రోజూ తన ప్యాసింజర్ ఆటోలో వ్యవసాయ పనులకు మహిళా కూలీలను తీసుకెళ్తాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం అంజయ్య తన ఆటోలో తమ కాలనీకే చెందిన మహిళా కూలీలను వీణవంక మండలం కాపులపల్లికి మక్క కంకి తీయడానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇళ్లకు తిరిగి వస్తుండగా ఆటో ఆముదాలపల్లి శివారులోని వంతెన వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి వంతెన కింద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఆయన భార్య సారమ్మ, కోడుళ్లు నందిని, సంగీత, కుక్కమూడి వీరయ్య, అతడి భార్య ఎల్లమ్మ, అలాగే మాతంగి మధునమ్మ, మాతంగి శంకరమ్మ గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనాల్లో జమ్మికుంట, హుజూరాబాద్ దవాఖానలకు తరలించారు. వీరిలో ఆటో డ్రైవర్ అంజయ్యతో పాటు మధునమ్మ, శంకరమ్మకు తీవ్ర గాయాలు కాగా, హుజూరాబాద్ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. వీరిలో అంజయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనా స్థలాన్ని కేశవపట్నం పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

## అల్ఫోర్స్‌లో విద్యార్థులకు పట్టాల పంపిణీ


కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 14 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

## 'రైతు నేస్తం'లో ఖాళీ కుర్చీలే!



కార్యక్రమానికి హాజరైన మండల వ్యవసాయ అధికారులు. రైతులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 14: చామనపల్లి రైతు వేదికలో సోమవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా భూభారతి ప్రారంభోత్సవం వర్చువల్ మీటింగ్‌లో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. రైతులెవరూ రాకపోగా, అధికార పార్టీ నాయకులు ఇలా కనిపించి వెంటనే జారుకోవడం కనిపించింది. దీంతో కేవలం అధికారులే పాల్గొని తూతూ మంత్రంగా కానిచ్చారు.

# లైన్ల తనిఖీ.. ఇక సులువు

- 33కేవీ, 11కేవీ ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు
- సర్కిల్ పరిధిలో 52 ఫీడర్లలో ఏర్పాటుకు నిర్ణయం

ముకరంపుర, ఏప్రిల్ 14: ప్రకృతి విపత్తులతో పాటు సాంకేతిక కారణాలతో సరఫరాకు అంతరాయం కలిగితే లైన్లను తనిఖీ చేసి దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తించడం విద్యుత్ అధికారులు, సిబ్బందికి శ్రమతో కూడుకున్న వ్యవహారం. గంటల తరబడి సరఫరా నిలిచిపోయి.. తిరిగి పునరుద్ధరించే వరకు వినియోగదారులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి రావడం ఇప్పటి వరకు ఉన్న పరిస్థితి. అయితే ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్(ఎఫ్పీఐఎస్) తో అంతరాయాలను వేగంగా గుర్తించి సరిచేసేందుకు పరిష్కారాన్ని చూపుతున్నది.


సాధారణంగా 33కేవీ, 11కేవీ లైన్లు కిలోమీటర్లకొద్దీ దూరంలో పంట పొలాలు, చేన్లు, కొండలు, గుట్టల సమీపాలతో పాటు వాగులు, చెరువుల మీదుగా ఉంటాయి. ఎక్కడైనా లైన్‌లో సమస్య ఏర్పడితే గుర్తించి సరిచేసేందుకు అధికారులు, సిబ్బంది ఓపికతో లైన్ల వెంట పరిశీలిస్తూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. సమస్య ఎక్కడుందో గుర్తించేందుకు చాలా సమయం పట్టడంతో పాటు విలువైన మానవ పని గంటలు కోల్పోవాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ విధానాన్ని ప్రస్తుతం కరీంనగర్‌లో అమలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో ఇప్పటికే 52 ఫీడర్ల పరిధిలో సాంకేతికంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని (ఎఫ్పీఐఎస్)ఏర్పాటుకు వ్యూహాత్మకమైన ప్రాంతాలను గుర్తించారు.

**వేగంగా లైన్ లోపాలు గుర్తింపు**

ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్‌తో లైన్‌లో ఎక్కడ లోపం ఉందో సులువుగా తెలుసుకోవచ్చు. అంతరాయం ఏ భాగంలో జరిగిందనే విషయాన్ని విశ్లేషించడం ద్వారా సిబ్బంది నేరుగా అక్కడికే వెళ్లి విద్యుత్ అంతరాయాన్ని సరిచేసి సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తారు. ఫలితంగా విద్యుత్ అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించి, వినియోగదారులకు నాణ్యమైన సరఫరా అందించవచ్చని కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ మేక రమేశ్ బాబు వివరించారు.

# మరమ్మతులు జరిగేనా.. మత్తళ్లు దుంకేనా?

- చెక్‌డ్యాముల రిపేర్లు మరిచిన ప్రభుత్వం
- పనులకు మరో రెండు నెలలు మాత్రమే అవకాశం
- వాగుల్లో నీరు నిలిస్తేనే భూగర్భ జలాల వృద్ధి



కల్వల వాగు కట్ట తెగి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

కలెక్టరేట్, ఏప్రిల్ 14 : వృథాగా పోతున్న వరదనీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంచాలనే నీటిపారుదల శాఖ లక్ష్యం నీరుగారిపోతున్నది. భారీ వర్షాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యాముల మరమ్మతుల్లో సర్కారు నిర్లక్ష్యం వహిస్తుండగా, జిల్లాలో వరుసగా రెండో ఏడాది కూడా వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడం మొదలైంది. ఫలితంగా నీటి కొరత రోజురోజుకూ తీవ్రమవుతుండగా, జిల్లా ప్రజానీకంలో ఆందోళన వ్యక్తమవుతున్నది.

జిల్లాలోని ప్రధాన వాగులన్నిటినీ జీవనదులుగా మార్చుతూ, రైతులకు సాగునీటి కొరత రాకుండా చూడాలనే ఉద్దేశంతో స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీటి పారుదల, అటవీశాఖలు, వాటర్‌షెడ్ల ఆధ్వర్యంలో చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పాత వాటికి మరమ్మతులు చేపట్టి, నీటి నిల్వలు పెంచేందుకు కృషి చేసింది. దీంతో, అనతికాలంలోనే ఊహించని విధంగా నిల్వలు పెరిగి, భూమట్టానికి సమానంగా చేరుకున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటిని ఎత్తిపోయడంతో ఉమ్మడి జిల్లా వాటర్ హబ్‌గా మారింది. అయితే స్వరాష్ట్ర సాధనకు ముందు కాల్వలు, వాగులపై అడ్డంగా, అడవుల్లో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ప్రస్తుతం చాలాచోట్ల అధ్వానంగా మారాయి. గతేడాది వర్షాకాలంలో కురిసిన వానలకు కొన్ని ధ్వంసం కావడం, మరికొన్నిచోట్ల మత్తడి కింది నుంచి నీరు లీకేజీ అవుతుండడంతో, క్రమేపి బలహీనపడుతున్నాయి. వీటిలో నీటి నిల్వలుంటేనే పరిసరాల్లోని వ్యవసాయబావుల్లో భూగర్భజలాలు వృద్ధి చెంది సమృద్ధిగా నీటి లభ్యత అవకాశం ఉంటుంది.

**సత్వరం స్పందిస్తేనే ఫలితం**

జిల్లాలో 21 చెక్‌డ్యామ్‌లు ఉండగా, అత్యధికంగా నీటి నిల్వల్లేక వెలవెలబోతున్నాయి. వర్షాలు పడ్డప్పుడు మాత్రమే నీరు కనిపిస్తుండగా, అనంతరం ఎండిపోతున్నాయి. అలాగే, భారీ వరదలతో ధ్వంసమైన వాటి పట్ల కూడా నిర్లక్ష్యం తాండవిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా వీణవంక మండలంలోని కోర్కల్ చెక్‌డ్యాం, శంకరపట్నం మండలంలో గల కల్వల ప్రాజెక్టు మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించినా, నిధుల విడుదలలో పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. మత్తడి లీకేజీలు ఉన్న వాటిలో ఒకటో, రెండో చెక్‌డ్యామ్‌లకు మాత్రమే పనులు చేస్తున్నట్లు తెలుస్తున్నది. మిగతావాటికి కూడా కొద్దిపాటి మరమ్మతులు చేసినా వినియోగంలోకి రానుండగా, పాలకుల నిర్లక్ష్యంపై ప్రజల్లో తీవ్ర అసహనం పెల్లుబికుతున్నది. వర్షాకాలానికి ముందు మరమ్మతులు చేపడితేనే ఫలితముంటుంది. ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించినా, ధ్వంసమైన వాటిని పూర్తి చేసేందుకు కనీసం రెండు నుంచి మూడు నెలలు పట్టే అవకాశం ఉంటుంది. నీటి నిలువల పెంపు తమ ప్రభుత్వం దృష్టిసారించిందనే మాటలకే పరిమితం కాకుండా, మరమ్మతులకు నిధులు విడుదల చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది. ఈ విషయమై సంబంధిత శాఖ డీఈని వివరణ కోరగా, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గంగాధర, ఏప్రిల్ 14 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రెడ్డి కార్పొరేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు బైరి గంగారెడ్డి సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే 50 ఏండ్లు నిండిన ప్రతి రైతుకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని, రైతు బీమా వయస్సు పరిమితిని 59 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు పెంచాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిగురుమామిడి, ఏప్రిల్ 14: తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (టీ సెర్ప్) ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గాగిరెడ్డిపల్లెలో మండల ప్రత్యేకాధికారి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొహినుద్దీన్, ఇందుర్తిలో ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, ఓబులాపూర్‌లో వీవో అధ్యక్షురాలు ఎంద్ర మహేశ్వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తాడ స్వరూపారాణి, మండల వ్యవసాయాధికారి రాజుల నాయుడు, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, ఏపీఎం మట్టేల సంపత్, సీసీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, గంప సంపత్ కుమార్, వీవో కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 14: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2, కరీంనగర్ రూరల్ ఏడీఈ లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 10.30గంటల వరకు శక్తి టెంపుల్ ప్రాంతం, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతా భవన్ వెనుక ప్రాంతం, కార్పెంటర్ సొసైటీ, సంతోషి మాతా హనుమాన్ గుడి, కొత్త లేబర్ అడ్డ, సాయిబాబా గుడి, ఉదయం 8నుంచి 11గంటల వరకు ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వల పార్కు సబ్ స్టేషన్ వరకు (బైపాస్ ఏరియా), పాలిటెక్నిక్ కాలేజ్ ఏరియా, శ్రద్ధ ఇన్ హోటల్ ప్రాంతం, ఐటీఐ కాలేజ్, డీ మార్ట్ ప్రాంతం, ఉదయం 9నుంచి 11.30గంటల వరకు కమాన్‌పూర్, గ్రానైట్ ఇండస్ట్రీస్ ప్రాంతాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, గుంజి మల్లికార్జున్ S/o. గుంజి రమణయ్య H.No. 1-8-10/1, ఆదర్శనగర్ మెట్‌పల్లి టౌన్ మరియు మండలం జగిత్యాల జిల్లా, నా పాస్‌పోర్ట్ నెం. P6900458 హైదరాబాద్ నుంచి మెట్‌పల్లికి బస్సులో వెళ్తున్నప్పుడు పోయింది. ఒక వేళ ఎవరికైనా దొరికినట్లయితే దయచేసి కాల్ చేయండి. సెల్ : 9985273703

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189